## క్లుప్తంగా

### జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పిస్తాం



ఉపాధి పనుల పరిశీలనలో ఎంపీడీఓ త్రివిక్రమ్

మెంటాడ: జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ త్రివిక్రమ్ తెలిపారు. గురువారం మండలంలోని జక్కువ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పని చేసిన వారికే మస్తర్లు వేయాలని సూచించారు. నిర్దేశిత కొలతల ప్రకారం రెండు పూటలా పని చేస్తే రోజుకు కనీసం రూ.250కు తక్కువ కాకుండా వేతనం వస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించిన ఆయన సచివాలయంలో అందుతున్న సేవలపై ఆరాతీశారు. సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

### నేత్ర శస్త్రచికిత్సకు 44 మంది పయనం



శస్త్రచికిత్సకు పయనమైన వారితో వైద్య సిబ్బంది

రాజాం సిటీ: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా దృష్టిలోపంతో బాధపడుతున్న 44 మందిని నేత్ర శస్త్రచికిత్సకు పుష్పగిరి కంటి ఆస్పత్రికి పొగిరి నుంచి గురువారం తరలించారు. ఈ సందర్భంగా పొగిరి వైద్యాధికారి బీవీ సత్యారావు, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ సకాలంలో నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా దృష్టిలోపం నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వీవీ సుందరేశ్వరరావు, జీవీ ప్రభాకరరావు, బి.రామచంద్రారావు, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సేంద్రియ ఎరువు తయారు చేయండి



రాజయ్యపేట చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు

రాజాం సిటీ: గ్రామాల్లోని చెత్త సంపద సృష్టి కేంద్రాల్లో విధిగా సేంద్రియ ఎరువులు తయారు చేసి, వినియోగించాలని ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో ఉన్న సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించిన ఆయన ఎరువు తయారీపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను నేరుగా కేంద్రానికి తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేసి, రాయితీపై రైతులకు అందించాలని తెలిపారు.

### చలివేంద్రం ఏర్పాటు

రాజాం సిటీ: స్థానిక కస్పా వీధిలో వాసవీక్లబ్ మనరాజాం–సారధి సభ్యులు గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతీ గురువారం రాజాంలో జరగనున్న వారపు సంతతో పాటు రానున్న వేసవి దృష్ట్యా పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్టెను ఏర్పాటు చేశామని సంస్థ అధ్యక్షుడు వాకచర్ల రాజ, కార్యదర్శి జి.రవికుమార్‌లు తెలిపారు. సంతలకు పశువులను తీసుకువచ్చే పాడిరైతులు దీనిని వినియోగించుకోవచ్చన్నారు.

### సైన్స్ ఉపాధ్యాయులకు 'లిప్'పై శిక్షణ



సూచనలిస్తున్న ఎంఈఓ లక్ష్మణరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో సైన్స్ ఉపాధ్యాయులకు లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్)పై గురువారం శిక్షణ ఇచ్చారు. బొబ్బిలి, రామభద్రపురం మండలాల నుంచి హాజరైన ఉపాధ్యాయులకు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సైన్స్ అంశాలు ఎలా బోధించాలన్న విషయంపై అవగాహన కల్పించారు. విజ్ఞానశాస్త్రం(సైన్స్)పై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, పాఠశాల హెచ్‌ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అంతర్జాతీయ ఇంద్రజాల దినోత్సవం

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామ సీబీఎం పాఠశాలలో అంతర్జాతీయ ఇంద్రజాల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రజాలికులు కె.కృష్ణదాస్, పలువురు ప్రముఖులు తొలుత ప్రముఖ ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన తీరును వక్తలు వివరించారు.

# సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

● ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం:

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పరిపాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్న ఏకైక వ్యక్తి మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, శాసనమండలిలో సైతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి, అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వివరించారు. ప్రజాసంకల్పయాత్రలో వెనకబడిన వర్గాలను చట్టసభల్లోకి తీసుకువస్తానని ఆయన వాగ్దానం ఇవ్వడమే కాకుండా నేడు వారిని తన పక్కనే కూర్చునేలా చేయడం చాలా గొప్ప విషయమన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, రాజ్యసభ, మంత్రి మండలి వరకు అన్నింట్లో బీసీ, ఎస్టీ, ఎస్టీ మైనారిటీలు, అందులో మహిళల చాలా ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం 36 ఎమ్మెల్సీ స్థానాలను పార్టీ గెలుచుకోగలిగితే వాటిలో 25 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉంటారన్నారు. తాజాగా 18 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తే అందులో 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీ ఉన్నారని, అంటే 14 స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారని పేర్కొన్నారు. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో కూడా నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలనేనన్నారు. మంత్రి వర్గంలో 70 శాతం మంది సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారన్నారు. జెడ్పీ చైర్మన్లుగా 13 మందిలో 69 శాతం మంది అంటే 9 మంది సామాజిక వర్గానికి చెందినవారని, నగర మేయర్లలో 86 శాతం మంది ఉన్నారన్నారు. అన్ని రంగాల్లో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తున్న సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వం అధికారం స్థాపించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, పి. లక్ష్మణరావులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, వి.విజయ్‌కుమార్, టి.తిరుమలరావు పాల్గొన్నారు.

**అన్ని వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట**

బొబ్బిలి రూరల్: అన్ని రంగాల్లో అన్ని వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 137 బీసీ కులాలు ఉన్న రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఖాళీ అయిన 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 14 స్థానాల్లో పోటీకి బీసీలకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అలాగే కార్పొరేషన్ల పదవీకాలం మరో రెండేళ్లు పొడిగించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఓ వైపు ప్రజాసంక్షేమం, మరో వైపు అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలను జనం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చంద్రబాబు కుమారుడు లోకేశ్ చేస్తున్న పాదయాత్ర ఆయన మాటలు, చేష్టలతో నవ్వులయాత్ర అయిందని ఎద్దేవాచేశారు. మన పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, విశాఖ రాజధాని కావాలన్న ఆకాంక్షను గట్టిగా వినిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టార్గెట్–175(175 అసెంబ్లీ స్థానాలకు గాను 175 అసెంబ్లీ స్థానాల్లో గెలుపు లక్ష్యం) సాధనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్.మురళీకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఐ.గోపాలరావు, జేఏసీ పట్టణ కన్వీనర్ ఆర్.విను, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

# డిజిటల్ విద్యే ప్రభుత్వ ధ్యేయం

● డీఈఓ లింగేశ్వరరెడ్డి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయమని డీఈఓ లింగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల విద్యాబోధన, డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వినియోగంపై ఆరాతీశారు. విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించడంలో విఫలం కావడంపై ఆయన కాస్త అసంతృప్తి వ్యక్తంచేశారు. సర్కారు పాఠశాలలకు సాధారణంగా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారే అధికంగా వస్తారని, వారికి ఉన్నత విద్యనందించేందుకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించిందన్నారు. దీంతో దేశ వ్యాప్తంగా అందరి చూపు ఏపీ వైపు పడిందన్నారు. ప్రతీ విద్యార్థి ట్యాబ్‌ను సక్రమంగా వినియోగించుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు మరింత విజ్ఞానం పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలతో పేదల చదువులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు మనదే..

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, పక్కనే ఎమ్మెల్యే జోగులు

రాజాం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు మనదేనని వైఎస్సార్ సీపీ విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఎంపీ ఎమ్మెల్సీ ఎన్నికలు, గెలుపు అవకాశాలపై పార్టీ నేతలు, కార్యకర్తలతో సమీక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎంతోమంది పట్టభద్రులకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన పార్టీ తరఫున బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# డ్రోన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: భూముల రీసర్వేతో రైతుకు ఎంతో మేలు జరుగుతోందని, ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు రీసర్వేతో పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో డ్రోన్ సర్వే గురువారం ప్రారంభించిన ఆయన సర్వే జరిగేటప్పుడు ప్రతీ రైతు పొలం వద్ద ఉండాలని సూచించారు. ఎటువంటి వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిరాజు, తహసీల్దార్ ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ)ను సాధించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా సంరక్షణ అధికారులతో గురువారం సమావేశమైన ఆయన కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మిషన్ అంత్యోదయలో భాగంగా 19 శాఖలకు సంబంధించి, 17 సుస్థిర లక్ష్యాలను, 169 నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా పని చేయాలని తెలిపారు.ఎస్‌డబ్ల్యూపీసీలు లేని పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వాటిని నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏకకాలంలో రీసర్వే, సరిహద్దు రాళ్ల ఏర్పాటు



కోడూరులో భూముల రీసర్వే పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శేషశైలజ

బాడంగి: భూముల రీసర్వే, సరిహద్దు రాళ్ల ఏర్పాటు ఏకకాలంలో జరిగేలా చూడాలని బొబ్బిలి ఆర్‌డీఓ పి.శేషశైలజ సూచించారు. మండలంలోని కోడూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే, గూడెపువలస గ్రామంలో జరుగుతున్న సరిహద్దు రాళ్ల ఏర్పాటును గురువారం పరిశీలించిన ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే చేసినప్పుడే సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. అదొకసారి, ఇదొకసారి అయితే ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ,

# సచివాలయం తనిఖీ

వంగర: మండలంలోని అరసాడ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామస్తుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. రికార్డుల నిర్వహణ, హాజరు, స్పందన వినతుల పరిష్కారంలో పక్కాగా ఉండాలన్నారు.

### ఎమ్మెల్యే అభినందనలు



షేక్ అబ్దుల్ హమీద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బొబ్బిలి పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ హమీద్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు గురువారం అభినందించారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన్ననలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్

రాజాం సిటీ: స్థానిక మెంటిపేటలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. ఇటీవల ఈ కాలనీకి చెందిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో అక్కడ పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. గురువారం పికెటింగ్ పరిస్థితులను సీఐ కె.రవికుమార్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గస్తీ ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. యువకుడి మృతిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ప్రతిష్టా విగ్రహాలకు ధాన్యాధివాసం



విగ్రహాలకు ధాన్యాధివాసం చేస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రతిష్టా విగ్రహాలకు ధాన్యాధివాసం చేశారు. భక్తులు సమర్పించిన ధాన్యంతో లక్ష్మీగణపతి, నవనాగసహిత, బాలసుబ్రహ్మణ్య, కాలభైరవ, చెండీశ్వర సహిత, కాశీవిశ్వేశ్వర, విశాలక్ష్మి స్ఫటిక లింగాలకు ధాన్యాభిషేకం చేశారు. అనంతరం అగ్నిహోత్ర కార్యక్రమం జరిగింది. శుక్రవారం విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేసి, భారీ అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## సంక్షిప్తంగా...

**ఉపాధ్యాయుడి మృతి**



రామకృష్ణారావు(ఫైల్)

రేగిడి: అనారోగ్యంతో మండలంలోని ఖండ్యాం గ్రామానికి చెందిన విరోధి రామకృష్ణారావు(58) అనే ఉపాధ్యాయుడు గురువారం మృతి చెందారు. ఈయన వంగర మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల రేగిడి, వంగర ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, దుర్గారావు, ఉపాధ్యాయులతో పాటు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, పోలినాటివెలమ రాష్ట్ర డైరెక్టర్ కింజరాపు పద్మావతి సురేష్, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొలివి జగ్గునాయుడు సంతాపం తెలిపారు.

**ప్రణాళికాబద్ధంగా బోధన**

రేగిడి: ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని రేగిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రేగిడి, వంగర మండలాలకు సంబంధించి, సైన్స్ ఉపాధ్యాయులకు లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్)పై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బోధించేటప్పుడు పాటించాల్సిన మెలకువలను వివరించారు. పాఠ్యాంశంలోని ప్రతీ విషయం చక్కగా అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు.

**హిందీ బోధనపై ప్రత్యేక శ్రద్ధ**

వంగర: హిందీ బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. గురువారం మండలంలోని కొప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల హిందీ ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన హిందీ పాఠ్యాంశాల్లో విద్యార్థులు పట్టు సాధించేలా బోధన చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.నాగభూషణదొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉచితంగా రేషన్ సరుకుల దిగుమతి**

రాజాం సిటీ: ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి డిపోలకు ఉచితంగానే రేషన్ సరుకులను దిగుమతి చేయాలని రాజాం మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు సూర్యనారాయణ కోరారు. గురువారం ఇదే విషయమై స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ మూర్తికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు డీలర్ల నుంచి హమాలీల చార్జీలు వసూలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల మహిళా అధ్యక్షురాలు ఉమాగౌరి తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత**

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామానికి చెందిన కొరగంజి అచ్యుతరావు(శివ)గత కొంతకాలంగా నరాల బలహీనతతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని అరసబలగ గ్రామ సర్పంచ్ కొరగంజి సాయిరాం గ్రామంలోని యువతతో మాట్లాడి, వైద్య ఖర్చుల నిమిత్తం సేకరించిన రూ.20 వేలను అతడికి గురువారం అందజేశారు. దాతలు మరింతమంది ముందుకు వచ్చి, అచ్యుతరావుకు ఆర్థికసాయం చేయాలని కోరారు.

**త్వరితగతిన సరిహద్దుల గుర్తింపు**

తెర్లాం: భూముల రీసర్వేలో భాగంగా సరిహద్దుల గుర్తింపును త్వరితగతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని నెమలాం గ్రామంలో జరుగుతున్న సరిహద్దుల గుర్తింపును పరిశీలించిన ఆయన రైతులందరినీ దగ్గర ఉంచే సరిహద్దులు గుర్తించాలని తెలిపారు. ఆయన వెంట మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ ఉన్నారు.

# మెనూ తప్పనిసరి



రేగిడి పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. గురువారం మండలంలోని రేగిడి, ఆమదాలవలస పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించిన ఆయన వేడి వేడిగా ఉన్నప్పుడే పిల్లలకు పదార్థాలు వడ్డించాలని నిర్వాహకులకు తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎం.రామినాయుడు ఉన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరవుతారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

# ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మాట్లాడుతున్న న్యాయవాదులు

రాజాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజాం పట్టణానికి చెందిన పలువురు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు మాట్లాడుతూ వైఎస్సార్ లా నేస్తం పథకంలో భాగంగా రూ.1.55 కోట్ల నగదును న్యాయవాదుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది కొత్తగా మరో 2,250 మంది న్యాయవాదులకు ఈ పథకం వర్తింపజేయడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసరావు, డీజీపీ ప్రసాద్, ఆర్.జయదేవ్, బి.సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: జూనియర్ న్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం పథకం వర్తింపజేయడం హర్షణీయమని జిల్లా లీగల్ సెక్రటరీ ఆర్‌ఈసీహెచ్ జయదేవ్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన న్యాయవాదుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం పాతవారికే కాకుండా కొత్తవారికి కూడా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ప్రతీ ఒకరి అకౌంట్‌లో రూ.5 వేలు చొప్పున జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రసాద్, సన్యాసిరావు ఉన్నారు.

# తాగి పట్టుబడితే జైలుకే..



వాహనదారులను బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మద్యం తాగి, వాహనం నడుపుతూ పట్టుబడితే జైలుకు వెళ్లడం ఖాయమని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఎస్‌ఐ సురేంద్రనాయుడుతో కలిసి పలు ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టిన ఆయన ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరమైతే, మద్యం సేవించి వాహనం నడిపితే సమాజానికి అంతకంటే ప్రమాదకరమన్నారు. అనంతరం పలువురు వాహనదారులను ఆపి, బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించారు. మద్యం మత్తులో ఎంతోమంది వాహనం నడిపి, యాక్సిడెంట్లు చేస్తున్నారని, దీంతో చాలామంది చనిపోవడమే కాకుండా, క్షతగాత్రులవుతున్నారని వివరించారు. మద్యం తాగినట్టు వాహనం నడుపుతున్నట్లు తేలితే జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తామన్నారు.

# ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు

● హౌసింగ్ పీడీ ఎస్వీ రమణమూర్తి



రాజాం: కంచరాం లే అవుట్ వద్ద సూచనలిస్తున్న హౌసింగ్ పీడీ రమణమూర్తి

రాజాం: ఉగాది పండగ నాటికి జిల్లాలోని జగనన్న కాలనీల్లో పెద్దఎత్తున సామూహిక గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తున్నామని హౌసింగ్ జిల్లా పీడీ ఎస్వీ రమణమూర్తి తెలిపారు. గురువారం మండలంలోని కంచరాం గ్రామ సమీపంలో ఉన్న జగనన్న లే అవుట్‌ను పరిశీలించిన ఆయన అక్కడి ఇళ్ల నిర్మాణాలపై ఆరాతీశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఆ తర్వాత సత్యనారాయణపురం వార్డు సచివాలయం వద్ద పట్టణానికి చెందిన వార్డు సచివాలయాల అడ్మిన్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించిన ఆయన జగనన్న కాలనీల్లో నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. సామూహిక గృహప్రవేశాలకు జిల్లాలో 15,780 ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. ఫిబ్రవరికి జిల్లా వ్యాప్తంగా 2,134 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా, 90 శాతం మేర నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కంచరాం లే అవుట్‌లో రాజాం అర్బన్‌కు సంబంధించి, 1,605 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 280 ఇళ్లు బేస్‌మెంట్ నుంచి శ్లాబ్ లెవల్‌లో ఉండగా, 40 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్‌డీఓ అప్పారావు, పబ్లిక్ హెల్త్ ఈఈ దక్షిణామూర్తి, హౌసింగ్ ఈఈ గౌరీశంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

**గృహప్రవేశాలకు సిద్ధం కావాలి..**

సంతకవిటి: ఉగాదికి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంకావాలని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించిన ఆయన మండలంలో సామూహిక గృహప్రవేశాలకు 400 ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నామని, నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కనకరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.